క్లుప్తంగా

అంధకారంలో మధురానగర్

బోట్‌క్లబ్: స్థానిక మధురానగర్‌లో నెల రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక 48వ డివిజన్ పరిధిలోని మధురానగర్ ప్రాంతంలో 349 విద్యుద్దీపాలు ఉండగా వీటిలో 70 వెలగడం లేదు. దీంతో పలు వీధుల్లో పూర్తిగా అంధకారం అలముకొంది. రాత్రి సమయంలో ఆయా ప్రాంతాలు దొంగలకు అడ్డాగా మారాయి. ఇటీవల మధురానగర్ ఒక ఇంటిలో దొంగతనం కూడా జరిగింది. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు వీధి దీపాల మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డొక్కా సీతమ్మ విగ్రహం ఏర్పాటు హర్షణీయం



డొక్కా సీతమ్మ విగ్రహాన్ని సందర్శించిన నరసింహమూర్తి, ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఉపాధ్యాయిని రామలక్ష్మి ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని సీతమ్మ మేనకోడలు భర్త మరువాడ నరసింహమూర్తి మంగళవారం సందర్శించారు. తన తల్లి వరసయ్యే ఆమె విగ్రహం పాఠశాలలో ఏర్పాటు చేశారని తెలుసుకుని వచ్చానన్నారు. విగ్రహం ఏర్పాటుపై ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భావోద్వేగం వ్యక్తం చేశారు. లంకల గన్నవరం గ్రామానికి చెందిన నరసింహమూర్తి ఇండియన్ ఆర్మీలో పని చేసి విశ్రాంత జీవనాన్ని సాగిస్తున్నారు. పాకిస్తాన్, చైనాలతో యుద్ధాలలో తాను పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గాయత్రి, సత్యవోలు శ్రీనివాస్, పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచిత విద్య అభినందనీయం

బోట్‌క్లబ్: నిరుపేద విద్యార్థులకు 8 ఏళ్లుగా ఉచిత విద్య అందించడం అభినందనీయమని రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు అన్నారు. స్థానిక రోటరీ చేయూత భవన్‌లో మంగళవారం చేయూత సంస్థలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. చేయూత సంస్థకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. చేయూత సంస్థ వ్యవస్థాపకులు రవికుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఉచిత విద్యకోసం 78 దరఖాస్తులు రాగా, 61 మందిని అర్హులుగా గుర్తించి అడ్మిషన్లు కల్పించినట్లు చెప్పారు. ఉచిత విద్యతోపాటు, భోజన, వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. డాక్టర్లు త్రిమూర్తులురాయుడు, విజయభాస్కర్ వైద్య సహకారం, ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రోటరీగోల్డెన్ జుబ్లీక్లబ్ సభ్యులు చిరంజీవిరెడ్డి, నల్లమిల్లి మాచారెడ్డి, నరహరిశెట్టి రవికృష్ణ, చేయూత సంస్థ కార్యదర్శి అలీమ్, కోశాధికారి చింతా సూర్యానారాయణ, బదిరెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేటలో ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం నిర్వహించిన దాడుల్లో మైలపల్లి మాయలు అనే మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద ఉన్న ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్, ఎస్సై వరహాలు తెలిపారు.

మెడికవర్‌లో అత్యాధునిక సీఆర్టీ - డి సేవలు



అత్యాధునిక సీఆర్టీ - డి ఇంప్లాంటేషన్ సేవలను వివరిస్తున్న వైద్యులు, సెంటర్ హెడ్ శుభాకరావు

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డులో అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక కార్డియాక్ రీసింక్రొనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్ (సీఆర్టీ - డి) ఇంప్లాంటేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. హృద్రోగులకు ప్రపంచ స్థాయి చికిత్సను అందించాలనే నిబద్ధతతో అధునాతన సేవలను మెడికవర్ హాస్పటల్స్ యాజమాన్యం కాకినాడ యూనిట్‌లో ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు మాత శ్రీనివాస్ మంగళవారం తెలియజేశారు. ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఆర్టీ - డి అనేది ఒక ప్రత్యేకమైన పరికరమని, గుండె గదుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి, పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడుతుందన్నారు. గుండె వైఫల్య లక్షణాలను ఇది తగ్గిస్తుందని, జీవన నాణ్యతను మెరుగు పరుస్తుందన్నారు. మరో గుండె వైద్య నిపుణుడు ప్రణవ్ మాట్లాడుతూ కాకినాడ ప్రజలకు అత్యాధునిక కార్డియాక్ కేర్‌ను అందించడంలో మెడికవర్‌లో తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మరో గుండె వైద్య నిపుణుడు కూరాకుల నరేష్ మాట్లాడుతూ ఈ చికిత్స ద్వారా గుండె సంబంధ ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ శుభకరరావు మాట్లాడుతూ సీఆర్టీ - డి సేవలను కాకినాడ మెడికవర్‌లో ఇద్దరు ఉపయోగించుకున్నారన్నారు.



తిమ్మాపురంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, గ్రామస్తులు



వాకలపూడిలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కరప పీహెచ్‌సీ ఎదురుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ, ఎంపీపీ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



యండమూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మది నిండా రాజన్నే

- వాడ వాడలా మహానేత వైఎస్సార్ జయంతి
- కన్నబాబు క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నివాళి
- రాజన్న సంక్షేమ పథకాలు గుర్తు చేసుకున్న ప్రజలు



కరపలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాకినాడ రూరల్: ఆరోగ్యశ్రీ, 104, జలయజ్ఞం తదితర ఎన్నో కార్యక్రమాలకు సారథ్యం వహించి, భౌతికంగా మనముందు లేకపోయినా కోట్లాది ప్రజల మనసులలో సజీవంగా నిలచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి, కేక్‌లు కట్ చేసి పంచిపెట్టి పండగలా చేసుకున్నారు. నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆదేశాలతో రమణయ్యపేట వైద్యనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద మహానేత విగ్రహానికి జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, జోనల్ అధ్యక్షురాలు మాకినీడి శేషుకుమారి, మహిళా విభాగం అధికార ప్రతినిధి పోలసపల్లి సరోజ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్యప్రకాశరావు, పిల్లి చక్రరావు, పార్టీ నేత గోపుశెట్టి బాబ్జీ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్ తదితరులు నివాళులర్పించి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐ.శ్రీను, వడ్డి మణికుమార్, కడియాల చిన్నా, నందిపాటి అజయ్, అనుసూరి ప్రభాకర్, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మల మడక నాగమణి, అధికార ప్రతినిధి సరోజ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి మహనీయుడని, ఆయన పాలన సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి తండ్రి బాటలో అభివృద్ధి, సంక్షేమ పాలన అందించారన్నారు. 2029లో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో జెండా ఎగరవేస్తుందన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం, పండ్లు, దుప్పట్లు పంపిణీ

నియోజకవర్గ కన్వీనర్ కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకినాడలోని బోట్‌క్లబ్ ఎదురుగా ఉన్న వృద్ధాశ్రమం, ఏపీఎస్పీ ఎదురుగా ఉన్న వృద్ధుల ఆశ్రమం, కాపు కళ్యాణ మండపం వద్ద వృద్ధాశ్రమాలలో అన్నదానంతో పాటు పండ్లు పంపిణీ చేసి, వృద్ధులకు దుప్పట్లు అందించారు. వాకలపూడి సంతోష్‌నగర్‌లోని రెడ్ క్రాస్ వృద్ధుల ఆశ్రమంలో జమ్మలమడక నాగమణి, రామశర్మ దంపతులు ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందజేశారు.

గ్రామాలలో పండగ వాతావరణం

వాకలపూడిలో మహానేత విగ్రహానికి జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, మహిళా నేత సరోజ, గ్రామస్తులు గొల్లపల్లి జగన్, విజయ్ సారథి, నల్లా శ్రీను, కరీం బాషా, భవాని, వెంకటేశ్వరరావు, కడియాల రాజు తదితరులు నివాళులర్పించి కేక్ కట్ చేశారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో, అచ్చంపేట జంక్షన్‌లో ఆటో యూనియన్ నాయకుడు ఎలుబండి రాజా ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, శ్రీను చంద్ర, అడబాల సత్తిబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు. పండూరు, చీడిగ, ఇంద్రపాలెం, నేమాం, సూర్యారావుపేట, సర్పవరం, రమణయ్యపేట, వాకలపూడి, తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు, తదితర గ్రామాలలో ఘనంగా రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు మహానేత విగ్రహానికి నివాళులర్పించారు.

గ్రామ, గ్రామాన వేడుకగా..

కరప: స్థానిక పీహెచ్‌సీ వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావుతో కలసి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు నివాళులు అర్పించారు. మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, పలివెల నాగేశ్వరరావు, వెలుగుబంటి సీతారామరాఘవ, వాసంశెట్టి రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, మద్దూరి భాస్కర్, నాగల బాలాజీ, గోన శ్రీను, తుమ్మలపల్లి చంద్ర నగేష్, పుణ్యమంతుల బాల, దివ్యాంగుడు పితాని శ్రీనివాస్, చోడిశెట్టి చంటి, గొర్రెల శ్రీనివాస్, కారపురెడ్డి రూపేంద్ర, కళిలింక మరిడియ్య, భోగిరెడ్డి సూర్యనారాయణ, రాయుడు శ్రీను, మంచాల శ్రీను, సోడగం సూరిబాబు, వాసంశెట్టి శ్రీనుబాబు, సింగినీడి నాని, బండారు సతీష్, నున్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, సర్పంచ్ ఆశాజ్యోతి సమకూర్చిన చీరలను పేదలకు పంచారు. మండల పరిధిలోని వేములవాడలో పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి కమిడి శంకర్, బండే తాతాజీ, వజ్రపు కామేష్, బండే వీరబాబు, ఉద్దండ సూర్యనారాయణ తదితరులు, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, అడబాల బుచ్చిబాబు, యండమూరులో గ్రామకమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, మాజీసర్పంచ్‌లు మార్నెళ్ల వెంకటరమణ, నురికుర్తి వీరన్న, షేక్ దరియా, రామారావు, వనుం గంగాధర్, నడకుదురులో దాలిపర్తి శ్రీనివాసరావు, జువ్వల చిన్నారావు వేళంగిలో సానా శ్రీను, జవ్వాది రాంబాబు, పెదకొత్తూరులో చింతా బుజ్జి, చోడిశెట్టి చంటి, చింతా ఈశ్వరరావు ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.



కాకినాడ రక్తదాన శిబిరంలో పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్‌కుమార్ తదితరులు



రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు నాగమణి, చిత్రంలో బెజవాడ సత్యనారాయణ



ద్వారంపూడి పుట్టిన రోజు సందర్భంగా మహర్షి సాంబమూర్తి పాఠశాల విద్యార్థులకు భోజనం

మహానేత సేవలు అజరామం

- నగరంలో ఘనంగా వైఎస్సార్ జయంతి
- సేవా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ నగరంలో దాదాపు అన్ని వార్డుల్లోను ఆయన జయంత్యుత్సవాలను మంగళవారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహాలను పూలమాలతో అలంకరించి నివాళులర్పించారు. కాకినాడ నగరానికి ఆయన చేసిన మేలును గుర్తుచేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, 108 వంటి వినూత్నమైన పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని నేతలు కొనియాడారు. కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో మహానేత వైఎస్సార్ నిలువెత్తు విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో పార్టీ నేతలు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నేతలు, అభిమానులకు పంచారు. నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడు రాజన్న అన్నారు.

పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్‌కుమార్(బన్నీ) ఆధ్వర్యంలో డి కన్వెన్షన్‌లో మహానేత జయంతి, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరానికి యువత తరలివచ్చి రక్తదానం చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం, రోటరీ బ్లడ్‌బ్యాంక్ తోడ్పాటుతో యువజన విభాగం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 59 మంది రక్తదానం చేశారు. ఇందుకు సహకరించిన రెడ్డి సంక్షేమ సంఘం, రోటరీ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులను యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్‌కుమార్ అభినందించారు.

జీజీహెచ్‌లో అన్నసమారాధన

కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆస్పత్రిలో వైఎస్సార్ సీపీ సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలిద్‌వలీ ఆధ్వర్యంలో రోగులకు, వారి బంధువులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, పార్టీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జిల్లా మైనార్టీ సెల్, వక్ఫ్‌బోర్డు మాజీ ప్రతినిధులు బషీర్, బాషా, ఖాన్, అజ్జు తదితరులు అన్నదానం చేశారు.

ద్వారంపూడి పుట్టిన రోజున

మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక సాంబమూర్తినగర్‌లోని పార్టీ నేతలు, అభిమానులు మహర్షి బులుసు సాంబమూర్తి పాఠశాలలో విద్యార్థులకు భోజనం ఏర్పాటుచేశారు. 33వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జి బోరా వెంకటేశ్వరరావు(పెద్ద) ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. పార్టీ సిటీ యువజన విభాగం అధ్యక్షుడు రోకళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి పుట్టిన రోజు సందర్భంగా స్కూల్ పిల్లలకు కేకులు పంచిపెట్టారు.

జగన్నాథపురం, డైరీఫారం సెంటర్, మున్సబుగారి జంక్షన్ తదితర ప్రాంతాల్లో మహానేత జయంతిని పార్టీ నేతలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ అధికారప్రతినిధి సుంకర విద్యాసాగర్, పార్టీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మహిళా రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి దీప్తికుమార్, మాకినీడి శేషుకుమారి, సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, ఎంజీకె కిశోర్, కంపర బాబి, చక్రి, చిక్కాల సుధాకర్, బెజవాడ బాబి, ముమ్మిడి పవన్, కర్రి అనంత,బెండా విష్ణు, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి నల్లమిల్లి మాచారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ జీజీహెచ్‌లో మైనార్టీ సెల్ ఏర్పాటు చేసిన అన్నదానంలో అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్ తదితరులు



33వ డివిజన్‌లో మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ డివిజన్ ఇన్‌చార్జి బోరా పెద్ద, సిటీ యూత్ అధ్యక్షుడు రోకళ్ల సత్యనారాయణ

బాలల సంరక్షణతో ఉజ్వల భారతం

కాకినాడ క్రైం: బాలలను సంరక్షిస్తే దేశ భవిష్యతను సంరక్షించినట్లేనని డీసీపీయూ (డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) అధికారులు అన్నారు. మంగళవారం కాకినాడ పీఆర్ కళాశాలలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ దయామణి ఆధ్వర్యంలో వార్డు స్థాయిలో బాలల పరిరక్షణ, బాలల హక్కుల కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. డీసీపీయూ అధికారి వెంకట్ మాట్లాడుతు బాలల పరిరక్షణకు ఉన్న చట్టాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పిల్లలపై జరిగే అకృత్యాల నివారణ తదితర అంశాలను వివరించారు. రక్షణ అధికారి విజయ బాలల దత్తత ప్రక్రియ, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ బాలల భద్రతకోసం పనిచేస్తున్న వివిధ సంస్థలను పరిచయం చేశారు. న్యాయ సలహాదారు సుధాకర్ పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్ కళాశాల ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కో ఆర్డినేటర్, కమిటీ సభ్యులు, ఐసీడీఎస్ ఈఓలు శ్రీ గౌరి, అరుణశ్రీ, జానకి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు బాలల భద్రతపై బాలల హక్కుల కమిటీ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు.

రేపు జాబ్ మేళా

కాకినాడ సిటీ: జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంత లక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టీమ్‌లీజ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీఐ గ్రూప్, అపోలో ఫార్మసీ, పేటీయం, ఇన్‌వోసోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ లిమిటెడ్, గేలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో తదితర వాటిల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ఉత్తీర్ణత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు.

ఏఎస్‌డీలో జాబ్‌డ్రైవ్

స్థానిక ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ధరిత్రి అడ్వైజరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టెలి కాలర్ ఉద్యోగాల కోసం జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్ ఈ నెల 11న జేకేజీ ల్యాబ్‌లో జరుగుతుందన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగానికి అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు కాకినాడలోని కార్యాలయంలో పని చేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.8 వేలు వేతనం అందిస్తారన్నారు.

శ్రమజీవుల సమ్మెకు సీపీఎం మద్దతు

కాకినాడ సిటీ: కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సీపీఎం నగర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మంగళవారం తెలిపారు. 1991లో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకు 21 జాతీయ సమ్మెలు జరిగాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న 22వ జాతీయ సమ్మె మోడీ బీజేపీ విధానాలకు గుణపాఠం చెప్పాలన్నారు. 11 కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు సంఘీభావంగా సంయుక్త కిసాన్ మోర్చా కూడా గ్రామీణ బంద్‌కు పిలుపు ఇవ్వడం కార్మిక కర్షక మైత్రిలో మరో మైలురాయి అన్నారు. శ్రమజీవులంతా బుధవారం నిర్వహించనున్న సమ్మెకు అండగా నిలవాలని వీరబాబు కోరారు.

సీఐటీయూ ఆటో జాతా

కాకినాడ రూరల్: సార్వత్రిక సమ్మె విజయవంతం కావాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆటో జాతా నిర్వహించారు. వలసపాకల జంక్షన్‌లో ఆటో జాతాను సీఐటీయూ నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, సివిల్ అండ్ మెకానికల్ యూనియన్ నాయకుడు వీరభద్రరావు మంగళవారం ప్రారంభించారు. కోరమాండల్, ఇండియన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం, ఫ్యారీ షుగర్స్, వలసపాకల, వాకలపూడి, పండూరు, తిమ్మాపురం తదితర గ్రామాల మీదుగా ప్రచారం నిర్వహించారు. మరో కార్యక్రమంలో భాగంగా సీ పోర్టు నుంచి సమ్మెను ఉదయం 6 గంటలకు ప్రారంభిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ తెలియజేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



గొర్రిపూడిలో స్థానికులతో కలసి మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ అనుపమ

కరప: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి ఆవరణలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ ఎం.అనుపమ పేర్కొన్నారు. మండలం గొర్రిపూడిలో మంగళవారం ఉపాధి హామీ ద్వారా నిర్వహించే ప్లాంటేషన్‌ను ఆమె ప్రారంభించారు. వనమహోత్సవంలో భాగంగా మండల పరిధిలోని ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆమె తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు, ఉపాధి పథకం జేఈ సంగీతలక్ష్మి, గ్రామ కార్యదర్శి వీరబాబు, టెక్నికల్ అసిస్టెంట్ కె.కనకదుర్గ, అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం, గండి సూర్యచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. పెనుగుదురులో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ శ్రీకాంత్, పంచాయతీ, ఉపాధి పథకం సిబ్బంది, జేఎస్పీ నాయకులు బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు తదితరులతో కలసి మొక్కలు నాటారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

కరప: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి, క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అన్నారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కొరిపల్లి గ్రామంలో పర్యటించి, పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటిని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. అనంతరం తాగునీటిని డీపీఓ పరీక్షించారు. తర్వాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.



కొరిపల్లిలో తాగునీటిని పరీక్షిస్తున్న డీపీఓ రవికుమార్

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇద్దరిపై క్రిమినల్ కేసు

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామం డ్రైవర్స్ కాలనీలో ఒక ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 11,335 కిలోల పీడీఎస్ బియ్యం నిల్వను గుర్తించిన సివిల్ సప్లైస్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పేదల నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచడంతో దాడులు చేసి బియ్యం బస్తాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై ఇంద్రపాలెం పోలీసులకు డీటీ మర్రి వీరాస్వామి ఫిర్యాదు చేశారు. బియ్యం నిల్వ ఉంచిన ఇంటిని ఎస్సై వీరబాబు, సిబ్బంది పరిశీలించారు. నిందితులు సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన అమలకోట వరహాలు, తలారి వీరబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. సీజ్ చేసిన 261 బియ్యం మూటలను భద్రత దృష్ట్యా ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్టు డీటీ తెలిపారు. బియ్యం విలువ రూ.5,27,077 ఉంటుందన్నారు.



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న సివిల్ సప్లైస్ అధికారులు, పోలీసులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాదిగ పేటల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: నగరంలోని మాదిగ పేటల్లో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 60వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా కో ఇన్‌చార్జి పసుపులేటి చినబాబుమాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్‌మాదిగ పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. యువత ఆధ్వర్యంలో జగన్నాథపురం బ్రిడ్జి నుంచి గోలీలపేట రామాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి 40 కిలోల కేక్‌ను కట్ చేసి పంచారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దోకుబుర్ర భద్రం, వల్లూరి రాజా, పువ్వుల భాస్కరరావు, మిరియాల వీరబాబు, మోటుకూరి వరలక్ష్మి, ఏడిద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: డిమాండ్ల సాధన కోసం అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం సమ్మెలో పాల్గొంటున్నట్టు కాకినాడ బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పర్మినెంట్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, కస్టమర్లపై సర్వీసు చార్జీలు తగ్గించాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించరాదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తదితర డిమాండ్లు చేశారు. మంగళవారం సాయంత్రం కాకినాడ మెయిన్‌రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి కె.ఆదినారాయణమూర్తి, శ్యాంకుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.